తీరని నీటి కష్టాలు

సూళ్లూరుపేట పట్టణంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. ప్రభుత్వ తాగునీటి పథకాలు సక్రమంగా పనిచేయకపోవడంతో ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. దీంతో పట్టణ ప్రజలు నీటిని కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. దీన్ని ఆసరాగా చేసుకున్న వాటర్ ప్లాంట్ల నిర్వాహకులు యథేచ్ఛగా ధరలు పెంచి నీటిని విక్రయిస్తున్నారు. మున్సిపాలిటీకి పన్నులు చెల్లిస్తున్నా తాగునీటిని కొనుగోయాల్సిన పరిస్థితి నెలకొందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- బిందెనీరు రూ.8
- 20 లీటర్ల క్యాన్ రూ.20
- మున్సిపాలిటీలో పన్నుల మోత
- సమస్యలతో ప్రజల సతమతం


నెర్రికాలువ నుంచి సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులోకి పంపు చేస్తున్న నీరు

సూళ్లూరుపేట : సూళ్లూరుపేట పట్టణంలో సుమారు 78 వేల మందికి పైగా జనాభా ఉంది. పట్టణంలో పది ఓవర్ హెడ్ ట్యాంకులున్నాయి. మన్నారుపోలూరు న్యూకాలనీ, ఇందిరానగర్, సూళ్లూరు, బాపూజీకాలనీకి సంబంధించిన ఓవర్ హెడ్ ట్యాంకులు శిథిలమై ప్రమాదకరంగా మారడంతో కూల్చివేశారు. వాటి స్థానంలో కొత్త ట్యాంకులు నిర్మించలేదు. సమ్మర్ స్టోరేజ్, ఇతర బోర్ల నుంచి రోజుకు 16 లక్షల లీటర్ల నీటిని అధికారులు సరఫరా చేస్తున్నారు. మున్సిపాలిటి పరిధిలో మనిషికి రోజుకు 70 లీటర్ల నీరు అవసరం అవుతుంది. ఈ లెక్కన సూళ్లూరుపేటలో 78 వేల మంది జనాభాకు సుమారు 64 లక్షల లీటర్ల నీటిని సరఫరా చేయాల్సి ఉండగా 10 లక్షల లీటర్లు మాత్రమే సరఫరా చేస్తున్నారు. పట్టణ శివారు ప్రాంతాల వారికి బిందె నీరు అందడం గగనంగా మారుతోంది. తాగునీటి పథకాల నిర్వహణ పట్ల అధికారులు నిర్లక్ష్యం వల్ల అక్రమ కొళాయిలు, సంపులు, వాటికి మోటార్లు ఏర్పాటు చేసుకుని నీటిని తోడేయడంతో తమకు కొళాయిల ద్వారా నీరు అందడం లేదని శివారు ప్రాంతాల వాసులు వాపోతున్నారు. దీన్ని ఆసరాగా చేసుకున్న కొంతమంది మన్నారుపోలూరు కేంద్రంగా తాగునీటి వ్యాపారం చేస్తున్నారు.


నీటిని విక్రయించేందుకు వెళుతున్న ప్రైవేట్ ట్యాంకర్లు, నిరుపయోగంగా వున్న ట్యాంకులు

నిరుపయోగంగా మారిన సమ్మర్ స్టోరేజ్

మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 2005లో సమ్మర్ స్టోరేజ్ నిర్మాణానికి రూ.6 కోట్లు మంజూరు చేశారు. దీంతో కోటపోలూరు పెద్దన్నగారి చెరువులో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌ను నిర్మించారు. దీని కింద 90 వేల లీటర్ల సామర్థ్యంతో తల్లంపాడు, కళాక్షేత్రంలో ఓహెచ్‌బీఆర్ ట్యాంకులను చేపట్టారు. వీటికి అనుసంధానంగా ఇందిరానగర్, బాపూజీ కాలనీ, సాయినగర్‌లో 60 వేల లీటర్ల కెపాసిటీతో ఓవర్ హెడ్ ట్యాంక్‌లు ఉన్నాయి. కళాక్షేత్రంలో 2.50 లక్షల కెపాసిటీ కలిగిన బాలెన్సింగ్ ఓవర్‌హెడ్ ట్యాంక్, మున్సిపల్ కార్యాలయం ఆవరణలో మరో ఓవర్‌హెడ్ ట్యాంక్ నిరుపయోగంగా వున్నాయి. కోళ్లమిట్టలో 1.20 లక్షలు, మన్నారుపోలూరులో 90 వేలు, 60 వేలు, వట్రపాళెంలో 40 వేలు లీటర్ల కెపాసిటీ కలిగిన ఓవర్‌హెడ్ ట్యాంకులున్నాయి. సమ్మర్ స్టోరేజ్‌తో పాటు తల్లంపాడు, చిన్నసత్రం, చెల్లమ్మబొంద, పందలగుంట, కొన్నెంబట్టు వద్ద వేసిన బోర్లు, పంపుహౌస్‌లను సోర్సులుగా ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతం నుంచి వచ్చేది మంచినీరు సరఫరా చేస్తున్నా ఫలితం లేదు. అధికారులు ఏటా పన్నులను పెంచుతూ భారం మోపుతున్నారని, తాగునీటిని సక్రమంగా వదలడం లేదని స్థానికులు వాపోతున్నారు.

తాగునీటికి అల్లాడుతున్నాం



మాది పట్టణ శివారు ప్రాంతం కావడంతో కొళాయిల ద్వారా నీరు రాకపోవడంతో అల్లాడుతున్నాం. రోజుకు రూ.50లు పెట్టి నీటిని కొనుగోలు చేస్తున్నాం. అధికారులు పన్నులు కట్టించుకుంటున్నారు. అందుకు తగినట్టుగా పనులు చేయడం లేదు. ముఖ్యంగా తాగునీరు ఇవ్వకపోతే ఎలా.

- ముంగర అమరావతి, దేగలపాలెం

పన్నులు కట్టించుకుంటున్నారు



మున్సిపాలిటీ అధికారులు పన్నులు కట్టించుకుని తాగునీరు ఇవ్వలేకపోతున్నారు. ప్రతిరోజూ వాటర్ క్యాన్లు కొని తాగాల్సి వస్తోంది. నిరుపయోగంగా వున్న ఓవర్ హెడ్ ట్యాంకులను వినియోగంలోకి తేవాలి. కొళాయిలకు మోటార్లు పెట్టి నీటిని తోడుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలి.

- శ్రీపతి రవీంద్ర, సూళ్లూరుపేట

ఓవర్‌హెడ్ ట్యాంక్ కూల్చేశారు



మాకు వచ్చే జీతంలో నుంచి నెలకు నీటి కోసం రూ.2500 కేటాయించాల్సి వస్తోంది. సూళ్లూరులో వున్న ఓవర్ హెడ్ ట్యాంక్ శిథిలమైందని కూల్చివేశారు. కొత్తది నిర్మించలేదు. డైరెక్ట్ పంపింగ్ చేస్తున్నారు. అవి ఎప్పుడు వస్తాయో తెలియదు. ఇప్పటికైనా నీటిని సక్రమంగా ఇచ్చేలా చూడాలి.

- పిట్ల చిన్న, సూళ్లూరు

క్లుప్తంగా

నూతన వధూవరులకు ఆశీర్వాదం


నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న కిలివేటి సంజీవయ్య, నాయకులు

ఓజిలి: మండలంలోని వెంకటరెడ్డిపాళెంలో శుక్రవారం అన్నెం అశోక్ కుమార్, దుర్గమ్మ వివాహం జరిగింది. మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. మాజీ మండల కన్వీనర్ దేశిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, సర్పంచ్ ప్రభాకర్‌రాజు, కోఆప్షన్ సభ్యుడు షేక్ ఖాదర్‌బాషా, యూత్ అధ్యక్షుడు బట్టా పృథ్వీకుమార్‌యాదవ్, బట్టా అనీల్‌కుమార్ యాదవ్, అన్నెం అనీల్ పాల్గొన్నారు.

ముందుగా గుర్తిస్తే క్యాన్సర్‌కు చెక్


మాట్లాడుతున్న వైద్యులు లియోనా

బాలాయపల్లి(సైదాపురం) : ముందుగా గుర్తిస్తే క్యాన్సర్‌కు చెక్ పెట్టొచ్చని బాలాయపల్లి పీహెచ్‌సీ వైద్యులు లియోనా తెలిపారు. మండలంలోని కయ్యూరు, వెంగమాంబపురం గ్రామాల్లో శుక్రవారం ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ తిరుపతి స్విమ్స్ ఆధ్వర్యంలో ఉచితంగా బీపీ, షుగర్ పరీక్షలతో పాటు నోటి క్యాన్సర్, మహిళలకు రొమ్ము క్యాన్సర్ నిర్ధారణ కోసం పాప్‌స్మియర్ పరీక్షలు చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో స్విమ్స్ మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ చైతన్య భాను, హరిత, సర్పంచులు వెంకటసుబ్బయ్య, గురునాథం, పంచాయితీ కార్యదర్శులు దయాకర్, మోహన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

కిశోర బాలికలకు ఆటల పోటీలు


ఆటల పోటీల్లో కిశోర బాలికలు

రాపూరు: మండలంలోని చెర్లోపల్లి అంగనవాడీ కేంద్రంలో శుక్రవారం గ్రామంలోని కిశోర బాలికలకు ఆటల పోటీలు నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక మాట్లాడుతూ కిశోరి వికాసంలో భాగంగా కిశోర బాలికలకు మ్యూజికల్ చైర్, పరుగు పందెం పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. కిశోర బాలికలు శారీరక వ్యాయామం చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఉమాదేవి, అంకమ్మ పాల్గొన్నారు.

క్రిస్ సిటీ పనులను అడ్డుకున్న గ్రామస్తులు


అధికారులతో చర్చిస్తున్న తీగపాళెం గ్రామస్తులు

చిల్లకూరు : చిల్లకూరు, కోట మండలాల తీర ప్రాంతంలో జరుగుతున్న క్రిస్ సిటీ పనులను శుక్రవారం తీగపాళెం గ్రామస్తులు అడ్డుకున్నారు. తమకు పూర్తి స్థాయి పరిహారం అందించే వరకు భూముల్లో వేరుశనగ సాగుకు అనుమతి ఇవ్వాలని పట్టుబట్టారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకున్నారు. పరిహారం ఇవ్వకుండా, పంటల సాగు లేకుండా ఎలా బతకాలని బాధితులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. పరిహారం కోసం ఆందోళనలు చేస్తున్న తమను పోలీసులు అడ్డుకోవడంపై మండిపడ్డారు. ఏపీఐఐసీ అధికారి శేఖరరెడ్డి మాట్లాడుతూ బాధితులందరికీ పరిహారం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. అభ్యంతరాలు ఏమైనా ఉంటే జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు.

కోడి ముద్దల కోసం భక్తుల పోటీ


ముద్దల కోసం పోటీ పడుతున్న మహిళా భక్తులు

చిల్లకూరు : గూడూరు పట్టణం రాజావీధిలో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో రెండు రోజులుగా వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఉదయం స్వామి వారికి సుప్రభాతం, తోమాల సేవలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు ఆలయం ఆవరణలోని ధ్వజ స్తంభానికి పూజలు చేసి గరుడ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా భక్తులకు కోడి ముద్దలు పంపిణీ చేశారు. వాటిని తీసుకునేందుకు భక్తులు పోటీ పడ్డారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు శ్రీకంఠి రామోహన్‌రావు, సభ్యులు పర్యవేక్షించారు.

పరిశ్రమ స్థాపన కోసం భూముల పరిశీలన


భూములను పరిశీలిస్తున్న అధికారులు, కంపెనీ ప్రతినిధులు

పెళ్లకూరు: మండలంలోని పాలచ్చూరు పంచాయతీలో ఏర్పాటు చేయనున్న పరిశ్రమ కోసం భూములను శుక్రవారం ఆర్డీవో కిరణ్మయి, కంపెనీ ప్రతినిధులు పరిశీలించారు. సర్వే నంబరు 6, 9, 416లో 22.49 ఎకరాలను మెస్సర్స్ దమ్ము బయో ఫ్యూయల్స్ ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీకి కేటాయించినట్లు ఆర్డీవో తెలిపారు. పరిశ్రమ నిర్మాణం కోసం రోడ్లు, విద్యుత్, నీటి సౌకర్యం తదితరాలపై ఆరా తీశారు. ఇటీవల ఎలాంటి సమాచారం లేకుండా నామమాత్రంగా ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టడంపై స్థానికులు మండిపడ్డారు. శుక్రవారం అధికారులు భూపరిశీలన వచ్చిన సమయంలో మీడియా ప్రతినిధులు రాకూడదని నాయుడుపేటకు చెందిన రెవెన్యూ ఉన్నతాధికారి సూచించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలచ్చూరు పంచాయతీలోని 22.49 ఎకరాల్లో ఏమి చేస్తున్నారనే దానిపై జిల్లా కలెక్టర్ పూర్తి స్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు దమ్ము కిశోర్‌బాబు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ రాజశేఖర్, పీఆర్వో గ్రేస్‌రాజా, తహసీల్దార్లు ద్వారకనాథ్‌రెడ్డి, రాజేంద్ర, వీఆర్వో శ్రీనివాసులు, సర్వేయర్ సూర్య పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడిన కాంట్రాక్టర్లపై చర్యలు


వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

చిల్లకూరు : గత ప్రభుత్వం పేదలకు మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్లు పనులు పూర్తి చేయకుండా నిధులు డ్రా చేసుకున్నట్లు బాధితుల నుంచి ఫిర్యాదులు అందాయని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ తెలిపారు. వారిపై తగిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఆయన శుక్రవారం గూడూరు పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో హౌసింగ్ అధికారులు, లబ్ధిదారులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టర్లు పనులు చేయకపోవడంతో పేదలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అదనంగా రూ.50 వేలు ఇస్తోందని, పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం సీఎం సహాయ నిధి చెక్కులు అందజేశారు.

ఎమ్మెల్సీ మేరిగను కలిసిన మొయిళ్ల గౌరి


ఎమ్మెల్సీని సత్కరిస్తున్న గౌరి

చిల్లకూరు : వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జోనల్ అధ్యక్షురాలు మొయిళ్ల గౌరి శుక్రవారం గూడూరులో ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో ఆయనను సత్కరించారు. ఆయన మాట్లాడుతూ గతంలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మహిళలకు రక్షణ కల్పించేందుకు దిశ చట్టాన్ని అమలుచేశారని తెలిపారు. కూటమి ప్రభుత్వం దాన్ని నిర్వీర్యం చేసిందన్నారు. ప్రస్తుతం మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆరోపించారు. మహిళలకు ఆత్మస్థైర్యం నింపేలా వైఎస్సార్ సీపీ మహిళా విభాగం పనిచేయాలని సూచించారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలి

చిల్లకూరు : విద్యార్థులు నాణ్యమైన భోజనం పెట్టాలని చిల్లకూరు ఎంఈవో-2 రవూఫ్ తెలిపారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మండలంలోని మధ్యాహ్న భోజనం నిర్వాహకులకు ఒక్క రోజు శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ ప్రతి రోజూ మెనూ ప్రకారం భోజనం వండాలన్నారు. ఇబ్బందులు ఎదురైతే హెచ్‌ఎంల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని సూచించారు. వంట గదులను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ శిక్షణకు విజయవాహిని చారిటబుల్ ట్రస్టు, టాటా ట్రస్టు సహాయ సహకారం అందించాయి. రిసోర్స్ పర్సన్‌గా రోజా వ్యవహరించారు. పాఠశాల హెచ్‌ఎం వరదిరెడ్డి జ్యోతి, సీఆర్పీలు వాసు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి హాకీ శిక్షణా శిబిరం


ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న బాలబాలికలు, అతిథులు

చిల్లకూరు : గూడూరు పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో నెల రోజులుగా నిర్వహిస్తున్న వేసవి హాకీ శిక్షణా శిబిరం శుక్రవారం ముగిసింది. హాకీ కోచ్ ఆకాష్‌దీపక్ మాట్లాడుతూ శిబిరంలో ప్రతిరోజూ 50 మంది వరకు పిల్లలు శిక్షణ పొందినట్టు తెలిపారు. వారికి దాతలు ఉదయం పాలు, గుడ్లు, అరటి పండ్లు అందజేసి సహకరించారని తెలిపారు. అలాగే కొంత మంది దాతలు హాకీ స్టిక్‌లు, క్రీడా దుస్తులు అందజేసినట్టు పేర్కొన్నారు. ముగింపు సందర్భంగా రెండు జట్లుగా విభజించి హాకీ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను సీనియర్ క్రీడాకారుడు టీఆర్ మణి అందజేశారు. ప్రగతి సేవా సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వసతి గృహంలో దోమల నివారణకు చర్యలు

వెంకటగిరి రూరల్ : వెంకటగిరి పట్టణంలోని ఓల్డ్ శివాలయం సచివాలయం పరిధిలో ఉన్న ఎస్‌డబ్ల్యూజీహెచ్-3 వసతి గృహంలో శుక్రవారం పాతకోట పీహెచ్‌సీ వైద్యుడు రాజేష్ ఆధ్వర్యంలో దోమల నివారణ చర్యలు చేపట్టారు. గదులు, మరుగుదొడ్లలో మందు పిచికారీ చేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌వో శివరామకృష్ణ, ఏఎన్‌ఎం సత్యవేణి, ఎంపీహెచ్‌ఏఎఫ్ రబ్బాని బాషా, వార్డెన్ సుమలత తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


జ్యోతి వెలిగిస్తున్న ట్రాయ్ అడ్వయిజరీ ప్రవీణ్‌కుమార్

చిల్లకూరు : సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ట్రాయ్ అడ్వయిజరీ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. గూడూరు పట్టణ సమీపంలోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం టెలికం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా ట్రై కస్టమర్ ఐటీ రీచ్ ప్రోగామ్ నిర్వహించారు. ట్రాయ్ అడ్వయిజర్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ పదేళ్లలో టెలికాం రంగంలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నాయని తెలిపారు. ఇంటర్‌నెట్‌తో పాటు సెల్‌ఫోన్ పెరిగిందన్నారు. ప్రజలకు అత్యంత వేగవంతమైన సేవలు అందించేందుకు టెలికాంలో పలు మార్పులు తీసుకువస్తున్నట్లు తెలిపారు. ఇంజినీరింగ్ విద్యార్థులు టెలికాం రంగానికి దోహదపడేలా పరిశోధనలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సురేష్‌బాబు, భిక్షం, హేమంత్, రవిప్రసాద్, నీరజ, విద్యార్థులు, టెలికాం అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి సిబ్బంది పనితీరుపై ఆగ్రహం


మాట్లాడుతున్న జెడ్పీటీసీ అనీల్‌కుమార్‌రెడ్డి

కలువాయి(సైదాపురం): మండలంలో ఉపాధి హామీ సిబ్బంది సక్రమంగా పనిచేయడం లేదని జెడ్పీటీసీ అనీల్‌కుమార్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ లక్ష్మీదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. జెడ్పీటీసీ మాట్లాడుతూ మండలంలో ఉపాధి హామీ కింద ఎంత మంది సిబ్బంది పనిచేస్తున్నారు, ఒక్కో గ్రామంలో ఎంత మంది కూలీలు పనిచేస్తున్నారో తెలియడం లేదన్నారు. హైకోర్టు ఉత్తర్వుల మేరకు ఆరుగురు ఫీల్డ్ అసిస్టెంట్లు విధుల్లో చేరారని, వారి జీతాల ప్రతిపాదనలు డ్వామా కార్యాలయానికి పంపించారా లేదా అని ఉపాధి ఏపీవో సునీల్‌ను ప్రశ్నించారు. మండల సర్వసభ్య సమావేశానికి చాలామంది అధికారులు రాకపోవడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో భవాని, తహసీల్దార్ శ్యామ్‌సుందర్, ఏపీఎం రవి, ఏఈ జయకుమార్, ఎంఈవో శేషగిరి, ఏఈలు శివారెడ్డి, అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం


వెంకటగిరిలో యోగాసనాలు వేస్తున్న పోలీసులు

వెంకటగిరి రూరల్/ఓజిలి : యోగాతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని వెంకటగిరి సీఐ ఏవీ రమణ, ఓజిలి ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శుక్రవారం వెంకటగిరి పట్టణంలోని నగర వనంలో వెంకటగిరి సర్కిల్‌లోని ఎస్‌ఐలు, పోలీసు కానిస్టేబుళ్లు యోగాసనాలు చేశారు. అదేవిధంగా ఓజిలి మండలం కత్రబల్లవోలు సచివాలయంలో సిబ్బందికి యోగా శిక్షణ ఇచ్చారు. వెంకటగిరి సీఐ ఏవీ రమణ, ఓజిలి ఎంపీడీవో విజయలక్ష్మి మాట్లాడుతూ ఈ నెల 21వ తేదీన అతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని యోగాపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ గోపి, పోలీసు సిబ్బంది, ఓజిలి ఈవోపీఆర్డీ రేణుక, పంచాయితీ కార్యదర్శి వెంకటేశ్వర్ రావు, నాయకులు మస్తాన్‌రెడ్డి, సుబ్బరావుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గూడూరులో కోవిడ్ భయం

చిల్లకూరు : కోవిడ్ మళ్లీ కోరలు చాస్తోంది. ఈ క్రమంలో గూడూరు పట్టణానికి చెందిన ఒకయువతికి కోవిడ్ లక్షణాలు ఉన్నట్టు తెలియడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల నెల్లూరు సర్వజన ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించుకున్న ఆరుగురికి కోవిడ్ లక్షణాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వారిలో గూడూరు పట్టణం మాళవ్యనగర్‌కు చెందిన యువతి(18)కి కోవిడ్ లక్షణాలు ఉన్నట్లు గుర్తించారు. ఆమెకు వైద్యులు తగిన మందులు ఇచ్చి హోమ్ ఐసోలేషన్‌లో ఉండాలని సూచించినట్లు తెలిసింది. దీనిపై డిప్యూటీ డీఎం హెచ్‌వో పద్మ విలేకరులతో మాట్లాడుతూ యువతి కుటుంబం మూడు నెలల క్రితమే నెల్లూరుకు వెళ్లిపోయిందని తెలిపారు. ప్రస్తుతం గూడూరులో ఎలాంటి కేసులు నమోదు కాలేదని తెలిపారు. ప్రజలు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని కోరారు.

రెండు ప్రమాదాల్లో ఇద్దరికి తీవ్ర గాయాలు

నాయుడుపేట టౌన్ : మండలంలోని అయ్యప్పరెడ్డిపాళెం సమీపంలో శుక్రవారం జరిగిన రెండు వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు లారీ డ్రైవర్లకు గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. లారీ కర్ణాటక రాష్ట్రం కోలార్ నుంచి మిర్చి లోడుతో నెల్లూరు వెళుతోంది. అయ్యప్పరెడ్డిపాళెం సమీపంలో డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకున్నాడు. దీంతో లారీ బారికేడ్లను ఢీకొని బోల్తా పడింది. డ్రైవర్ రాజేష్ గాయపడ్డాడు. అతన్ని స్థానికులు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అదేవిధంగా కోలార్ నుంచి కూరగాయల లోడుతో నెల్లూరు వైపు వెళుతున్న మినీ లారీ వేగంగా వచ్చి ముందు వెళుతున్న ట్యాంకర్‌ను ఢీకొంది. డ్రైవర్ గాయపడ్డాడు. అతన్ని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు అక్కడికి చేరుకుని రెండు లారీలను పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. కేసులు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

కండలేరులో 39.176 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో శుక్రవారం నాటికి 39.176 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఇన్‌చార్జి ఈఈ రామచంద్రమూర్తి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 2,300, పిన్నేరు కాలువకు 10, లోలెవల్ కాలువకు 60, హైలెవల్ కాలువకు 50, మొదటి బ్రాంచ్ కాలువకు 85 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

పొలాల్లో పడి లేస్తూ..

- వృద్ధులకు తప్పని రేషన్ తిప్పలు


బియ్యం తీసుకుని పొలం గట్టు మీద నడుచుకుంటూ వెళుతున్న వృద్ధురాలు, బాలుడు

చిట్టమూరు : కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్ని వర్గాల ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. ఇంటింటికీ బియ్యం సరఫరా చేసే వాహనాలను రద్దు చేసి పాత పద్ధతిని అమలుచేయడంతో రేషన్ సరుకుల కోసం వృద్ధులు, వికలాంగులు పడుతున్న బాధలు అన్నీఇన్నీ కావు. చిల్లమూరు, ఆరూరు పంచాయతీలో ఒక్కో పంచాయతీకి ఆరు గ్రామాలు ఉన్నాయి. వీరు పంచాయతీ కేంద్రానికి వెళ్లి బియ్యం తెచ్చుకోవాలి. ఈశ్వరవాక పంచాయతీ కోతలగుంట గ్రామస్తులు 10 కిలోమీటర్లు వెళ్లి తెచ్చుకోవాల్సి వస్తోంది. ఆరూరు గ్రామం పెద్ద దళితవాడ వాసులు కిలోమీటర్ దూరం పంట పొలాల గట్లపై నడిచి వెళ్లి బియ్యం తెచ్చుకున్నారు. జస్వంత్ అనే 8వ తరగతి విద్యార్థి, అతని నాన్నమ్మ పొలాల గట్లపై పడిలేస్తూ బియ్యం తెచ్చుకున్నారు. వారి అవస్థలను చూసి స్థానికులు ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్ జరుపుకోవాలి


మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

నాయుడుపేట టౌన్ : ముస్లింలు బక్రీద్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆకాంక్షించారు. ఆయన శుక్రవారం ముస్లింలకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

నిబంధనలు ఉల్లంఘించొద్దు

బక్రీద్ పండుగ సందర్భంగా ఎక్కడా గోవధ చేయొద్దని నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు తెలిపారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించకుండా పండుగ జరుపుకోవాలని సూచించారు. డివిజన్ పరిధిలోని నాయుడుపేట, సూళ్లూరుపేట, ఓజిలి, పెళ్లకూరు, దొరవారిసత్రం, శ్రీహరికోట, తడ పోలీస్‌స్టేషన్ల పరిధిలో పోలీసుల నిఘా పెట్టామని, నిబంధనలు ఉల్లంఘించకుండా ప్రశాంతంగా పండుగ జరుపుకోవాలని సూచించారు.

ఇసుక, మట్టి అక్రమ తవ్వకాలపై పోలీసుల తనిఖీ

సాక్షి ఎఫెక్ట్..

నాయుడుపేట టౌన్ : మేనకూరులోని మామిడి కాలువలో ఇష్టారాజ్యంగా జరుగుతున్న ఇసుక, మట్టి తవ్వకాలపై పోలీసులు శుక్రవారం తనిఖీలు చేపట్టారు. ఇసుక, మట్టి తవ్వకాలపై శుక్రవారం రెచ్చిపోతున్న ఇసుక, మట్టి మాఫియా అన్న శీర్షికన సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దీనిపై పోలీసులు స్పందించారు. మామిడి కాలువ పరిసరాల్లో తనిఖీలు చేపట్టారు. స్థానికులతో మాట్లాడి మామిడి కాలువలో ఇసుక, మట్టి అక్రమ తరలింపులు చేస్తుంది వాస్తమమేనని తెలుసుకున్నారు. ఇక్కడ ఇసుక తవ్వకాలు చేపట్టకుండా చూడాలని మేనకూరు సచివాలయ మహిళ పోలీసు, వీఆర్వోకు సూచించారు.

ఉపాధి హామీ కింద పండ్ల తోటల పెంపకం

కలువాయి(సైదాపురం): ఉపాధి హామీ పథకం కింద 2025-26 సంవత్సరానికి పండ్ల తోటల పెంపకానికి మండలంలోని రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో భవాని తెలిపారు. నిమ్మ, మామిడి, బత్తాయి తోటలు పెంచుకోవచ్చని తెలిపారు. చిన్న, సన్నకారు రైతులు సర్టిఫికెట్, అండగల్, 1బి, జాబ్‌కార్డు, బ్యాంకు పాస్ బుక్ జిరాక్స్ కాపీలతో ఏపీవోలను సంప్రదించాలని సూచించారు.

ఉన్నత పాఠశాలలకు నూతన హెచ్‌ఎంలు

కోట: మండలంలోని జెడ్పీ హైస్కూళ్లలో పనిచేస్తూ బదిలీపై వెళ్లిన వారి స్థానంలో నూతన హెచ్‌ఎంలను నియమించినట్లు ఎంఈవో-2 మస్తానయ్య తెలిపారు. కోట బాలుర జెడ్పీ హెచ్‌ఎస్‌కు కరుణాకర్, కోట బాలికల జెడ్పీహెచ్‌ఎస్‌కు పి.భారతి, కొత్తపాళెం జెడ్పీహెచ్‌ఎస్‌కు గిరిధర్, గోవిందపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌కు పార్వతి, గూడలి జెడ్పీహెచ్‌ఎస్‌కు సీహెచ్ మస్తానయ్య, కొక్కుపాడు జెడ్పీహెచ్‌ఎస్‌కు వెంకయ్యను నియమించినట్లు తెలిపారు. అదేవిధంగా మండలంలోని చెందోడు, ఊనుగుంట పాళెం, ఉత్తమనెల్లూరు ప్రాథమికోన్నత పాఠశాలలను అప్‌గ్రేడ్ చేసి ఉన్నత పాఠశాలలుగా మార్చినట్లు తెలిపారు.